# 11

## అగఘోయన ప్రయాణం

"శశిరేఖమ్మగారోయ్, 'రాజకుమారి' టాకీసులో వచ్చేవారం 'గాలా' ఓపెనింగుటండీ!"

"ఏం పిక్చరోయ్?"

" 'భువనైకసుందరి'. "

"ఎవరు నటించినది?"

"మీకు తెలియదూ?" అంటూ ఆశ్చర్యపోయాడు నాగరాజు.

"మన కనకలతేనండీ. హీరోయిను!" అన్నాడు.

'మన' అంటే శశిరేఖకు నవ్వు వచ్చింది. శశిరేఖ అనగా చీఫింజనీయరు సుధాకరరావు కుమార్తె. నాగరాజు వారియింటి వంటమనిషి.

కనకలత అతనికి అభిమాన తార. తనద్వారా ఆ ఇంటివారం దరి గౌరవానికీ ఆమె ఆస్పదురాలు కావలసిందే మరి! అందుకే అతడు 'మన కనకలత' అన్నాడు. శశిరేఖ మందహాసాన్ని మరుగుపరుచుకుంటూ, 'వచ్చే వారంలో ఫిలిము చూడటానికి యిప్పుడే సెలవుదరఖాస్తు పడేస్తున్నావన్నమాట' అన్నది.

"సెలవుదరఖాస్తు కేముందండీ? వంట పూర్తిచేసి, ఆరున్నర ఆటకి వెళ్ళొచ్చు... నేనడిగేది సెలవుకాదండీ!"

"ఏమిటి మరి?"

"టిక్కెట్టు కొనుక్కునివెడితే ఆరణాలకే వెళ్ళాలండీ..."

"మరి?"

"నాకు చాలారోజులనుంచి ఒకసరదా ఉందండీ."

"ఏమిటి?"

"కనకలత ఫిలిం ఏదైనా వస్తే, చచ్చు అరణాలలో కాకుండా దర్జాగా, రిజర్వుడు క్లాసులో కూర్చుని చూడాలనండీ."

"రెండున్నర వదిలిపోతుందే మరి!"

"కొనుక్కోడమంటే కుదరదని చెప్పేను కదండీ?"

"కొనకుండా ప్యాసు సంపాదిద్దామనా?"

"మరేనండీ."

"ఇంకనేం, సంపాదించు. నువ్వెరుగున్నవా ళ్లెవరో ఉన్నారు కామోసు."

"అబ్బే, లేరండీ, మీరే సంపాదించి పెట్టాలి."

"నేనా?" అంటూ ఆమె ఆశ్చర్యపోయింది. "నాకెవరూ తెలియదే?"

"మొన్న పేరంటానికి వెళ్లినప్పుడు అక్కడికి కనకలత కూడా వచ్చిందని మీారు అమ్మగారితో చెపుతూండగా విన్నాను కదండీ?"

"నిజమే. అంచేత?"

"ఆ పరిచయం చాలండీ. మీారామె కొక చీటీ రాసి ఇస్తే నేనే వెళ్లి తెస్తానండీ."

"అబ్బే, అది బాగుండదు. ఆవేళ కాస్త ముఖపరిచయమైనంతమాత్రాన ప్యాసులడుగుతే బాగుంటుందా?... ఇంతకీ ప్యాసెందుకు పోనిద్దూ! నేను డబ్బిస్తాను చూద్దుగాని."

"ప్యాసైతే మనం అందరం వెళ్లవచ్చునండీ. కొనుక్కోడమైతే బోలెడైపోదండీ?"

"చూద్దాంలే."

## 2

మనునాడు వారింటికి టెలిగ్రాం వచ్చింది. శశిరేఖే అందుకుంది. ప్రద్యుమ్నకుమార్ ఐ. ఏ. ఎస్. ప్యాసయాడన్న శుభవార్త విని వారంతా ఆనందించారు.

"శ్రమపడి చదివించినందుకు ఫలించింది" అన్నారు సుధాకరరావుగారు.

"అబ్బాయి తప్పకుండా ప్యాసవుతాడని నాకు మొదటి నుంచీ ధైర్యమే" అంది స్వర్ణమ్మగారు. "ఇంతవరకూ వాడు అపజయమనేది ఎరగడుగా?"

"తక్కిన పరీక్షలకీ, దీనికీ తేడా వుంది మరి. ఇది ప్యాస వటమంటే గొప్ప కాదూ?!" అన్నారు సుధాకరరావుగారు. "ఏ ర్యాంకులో వచ్చాడో?"

శశిరేఖ వింటూ, చటుక్కున, "నాన్నగారూ, అన్నయ్య రావటంతోనే స్నేహితుల్నందర్నీ పిలిచి సరదాగా ఒక డిన్నరివ్వాలండీ" అంది.

"తప్పకుండా ఇద్దాం" అన్నా రాయన. శశిరేఖ ఏమి తలపెట్టినా దిగ్విజయంగా నెరవేర్చగలదు. ఆయన ఊరికే ఆమోదిస్తే చాలు; అంతా ఆ అమ్మాయే ఏర్పాటుచేస్తుంది.

కుమార్ బుధవారంనాడు వస్తాడు. గురువారంనాడు డిన్నరిస్తే సరి. ఎవరెవర్ని ఆహ్వానించాలో ఆమె జాబితా తయారుచేసింది. ఆహ్వానాలను సొంతంగా టైపుచేసి బంట్రో తులద్వారా ఆదివారం సాయంత్రానికే అందజేసింది.

నాగరాజుకి ఫేణీలూ, రసగుల్లాలూ చెయ్యటం బాగా చేతనౌను. ఆ రెండూ చేయించాలి. సేమ్యా పాయసం యెలాగా ఉంటుంది! వెజిటబుల్ కూర్మా, ఉల్లగడ్డ చిప్సూ, అవియల్ వగైరాలన్నీ ఉండాలి. ఏయే సరుకులు, ఎంతెంత కావాలో నాగరాజును కనుక్కొని జాబితా తయారుచేసింది.

## 3

బుధవారం మెయిల్లో ప్రద్యుమ్నకుమార్ వచ్చాడు. ఆ మెయిల్లోనే నాగరాజు కొక పసుపుకార్డుకూడా వచ్చింది.

"ఏముటోయ్ శుభలేఖ?" అని వారెవరైనా అడిగి తెలుసుకుంటారేమో అని కొంతసేపు నాగరాజు ఎదురు

చూశాడు. వారంతా కుమార్‌తో ముచ్చటించటంలో ఉండిపోవటంవల్ల నాగరాజు ప్రసక్తి ఎవరికీ లేకపోయింది. ఆఖరికి అతడే, "శశిరేఖమ్మగారూ," అని పిలిచాడు.

"ఏమోయ్?"

"మా మేనమామకూతురు పెళ్లిటండీ."

"ఎప్పుడు?"

"రేపురాత్రేనండీ. ఈవేళ మెయిలుకే వెళ్ళాలండీ!"

శశిరేఖ విస్తుపోయింది. "రేపురాత్రే కదుటోయ్ మనం డిన్నరు తలపెట్టేం? నువ్విప్పుడు వెడతానంటే ఎలాగ?"

"నేనూ అదే ఆలోచిస్తున్నానండీ. దగ్గిరగా ఉండీ కూడా వచ్చాడుకాదు అని నిష్ఠూరం వేస్తారండీ."

శశిరేఖకు నడుం విరిగినట్టయింది. "అంతా సిద్ధంచేసుకున్నాక వెడతానంటే ఎలాగోయ్? ఇన్విటేషన్లుకూడా పంపేశాం, బాగుంటుందా?"

"డిన్నరు మానెయ్యనద్దు. మరొాహణ్ణి ఏర్పాటుచేసి వెడతానండీ."

శశిరేఖకు ఆ యేర్పాటు ఇష్టంలేదు. నాగరాజు చేసినట్లు రసగుల్లాలూ, ఫేణీలూ ఇంకెవరూ చెయ్యలేడనే ఆమె అభిప్రాయం. అతడు ప్రయాణమైనా మానుకోవాలి. తాము డిన్నరైనా మానుకోవాలి. ఆమె ఆలోచనలో పడింది.

"ఏమిటి చెల్లాయ్, దీర్ఘంగా ఆలోచిస్తున్నావు?" అన్నాడు కుమార్ వచ్చి. ఆమె చెప్పింది.

"ఇంత ఆలోచనెందుకే? డిన్నరు మానేద్దాం."

"నాకు బి. ఎస్. సీ.లో ఫస్టుక్లాసు వచ్చిందని ఆనాడు నువ్వు టీపార్టీ చేయించావు. ఇప్పుడీ డిన్నరు మానెయ్యమంటే వప్పుకుంటానా?"

అంతలో స్వర్ణమ్మగారు వచ్చింది. ఆమెవోటుకూడా డిన్నరు మానెయ్యటానికే పడింది. రహస్య మేమిటంటే, నలుగుర్నీ రప్పించి హడావుడిచేస్తే కుమార్‌కి 'దిష్టి' తగులుతుందేమో అన్న భయం ఒకటుందామెకు. టీపార్టీ జరిగిన మరునాడు శశిరేఖకు కొంచెం ఉష్ణం తగిలింది కదూ? 'దిష్టి' తగిలే వచ్చిందా ఉష్ణం!

శశిరేఖకు డిన్నరు మానెయ్యటం మనస్కరించలేదు. ఆహ్వానాలు పంపి, ఇప్పుడు ఒక్కొక్కళ్ళకీ, 'లే'దంటూ టెలిఫోన్‌లో చెప్పుకోడం యేమిబాగుంటుంది? ఎలాగైనా నాగరాజునే ఆపెయ్యాలి. ఆమెకు చటుక్కున ఒక ఆలోచనవచ్చి, "ఏం నాగరాజూ, ఎల్లుండి 'భువనైకసుందరి' సినిమా చూడాలన్నావుకదూ?" అంది.

"ఔనండీ. ఆ టైముకి అందుకుంటాను."

శశిరేఖ కోపాన్ని మరుగుపరుచుకుంటూ అక్కడనుంచి వెళ్ళిపోయింది.

## 4

సాయంకాలం నాలుగ్గంటలకు టీ త్రాగటం అయాక, శశిరేఖ 'డిన్నరు లే'దని ఆహ్వానితులకు తెలియజేయటానికి టెలిఫోనుముందు కూర్చుంది.

జాబితాలో మొదటిపేరు ప్రొఫెసర్ వైద్యనాథనుది. కుమార్ ప్రెసిడెన్సీకాలేజీలో ఆయనవద్ద చదువుకున్నాడు. ఆయన నెంబరు 85136. రిసీవరు ఎత్తి డయల్ చేద్దామనుకునే సరికి తన ప్రయాణానికి డబ్బు అడుగుదామని ఆ హాల్లోకి నాగరాజు వచ్చాడు. అతణ్ణి చూడటంతోనే ఆమెకు చటుక్కుని మళ్ళీ ఒక ఆలోచన వచ్చింది. డయల్ చెయ్యకుండానే, అతణ్ణి చూడనట్లు నటిస్తో, ఆమె టెలిఫోన్లో, "హల్లో! కనకలతగారున్నారాండీ?" అంది.

నాగరాజు నాగస్వరం విన్న నాగరాజుకిమల్లే నిలబడి పోయి వింటున్నాడు. ఆమె ఒక్క నిమిషం ఆగి, "ఆ... కనకలతగారేనా? నమస్తే...ఏంలేదూ? రేపు మాయింట డిన్నరుకు రమ్మనికదూ, మిమ్మల్ని రిక్వెస్ట్ చేశాను?" అని, అవతల కనకలత చెప్పేది వింటున్నట్లు అభినయిస్తో ఒక్క క్షణం ఆగింది. నాగరాజు వింటూనే వున్నాడు.

ఆమె మళ్లీ "మరేనండీ, మా కొక అవాంతరం వచ్చి, డిన్నరు—"

నాగరాజు ఆమెను వాక్యం పూర్తిచెయ్యనివ్వకుండా, పరుగెత్తివచ్చి, "ఆగండి చెబుదురుగాని!" అన్నాడు. శశిరేఖ, "కనకలతగారూ, ఒక్కక్షణం ఆగండి చెపుతాను" అని, రిసీవరు మౌత్ పీస్ కి చెయ్యి అడ్డుపెట్టి, "ఏమిటోయ్?" అంది.

"నేను ప్రయాణం మానేస్తున్నానండీ!"

"ఏం?"

"ఏంలేదూ! మీరంతా సిద్ధంచేసుకుని నా ప్రయాణం మూలాన ఇప్పుడు వాయిదా వేస్తే యేం బాగుంటుందండీ? కనకలతలాంటివారందరితోనూ ఇప్పు డిలాగ చెప్పటమన్నా అంత మర్యాద కాదు."

"పెళ్ళికి రాకపోతే మీ మామయ్య నిష్ఠూరం వేస్తా డన్నావ్?"

"వేస్తే వేస్తాడు లెండి. మరొక సంగతి కూడా వుందండి. అసలు ఈ పిల్లని నాకిచ్చి పెళ్ళిచెయ్యవలసిందండీ. మా అమ్మ ఎంత బ్రతిమాలినా ఆయనగారు ఒప్పుకోక పైగా చేసుకుంటున్నాడు. అలాంటప్పుడు నేనెందుకు వెళ్లాలి? నాకు మాత్రం అభిమానం వుండదేమిటండీ?"

"అలాగైతే కనకలతగారితో రేపు డిన్నరుందని చెప్ప మంటావా?"

"చెప్పి, తప్పకుండా రమ్మనండి!" అంటూ అతడు వంటింట్లోకి వెళ్ళిపోయాడు.

నాగరాజు లోనికి వెళ్ళటంతోనే శశిరేఖ కనకలతకు ఫోన్ చేసి, విందుమాట చెప్పి, ఆహ్వానించింది. కనకలత ఏదో కారణం చెప్పి రాలేనందికాని, శశిరేఖ 'తప్ప'దని పరిపరి

విధాల చెప్పి ఆమెచేత 'సరే' అని అనిపించుకున్నాకనే రిసీవరు పెట్టింది.

అక్కడ వంటింట్లో రసగుల్లాలు ప్రారంభించిన నాగరాజు, "రేపు డిన్నర్లో కనకలతకు నేనే స్వయంగా రసగుల్లాలూ, పేణీలూ వడ్డించాలి. 'మొహమాటం పడకండి! వేసుకోండి!' అని నాలు గెక్కువ తినిపిస్తాను! ఏదో అదునుచూసుకొని 'వింతవివాహం'లో మీరు బలేగా యాక్టు చేశారండి!" అని మెచ్చుకుంటాను. అప్పుడామె, 'ఈ రసగుల్లాలూ, పేణీలూ బలేరుచిగా తయారుచేశారండీ!' అని మారు మెచ్చుకుంటుందే;...నయం కదూ, కనకలత వస్తోందన్న సంగతి తెలవక నెల్లూరికి చెక్కేసేయాను కాదు!" అని తన్నుతానే అభినందించుకున్నాడు.